● ఎన్నికైన ప్రజా ప్రతినిధులపై లక్షలాది పేద ప్రజలకు నిజంగా నియంత్రణ ఉంటుందా? ప్రజాస్వామ్యం అంటే ప్రజల పాలనా లేక కేవలం ప్రజాప్రతినిధుల ద్వారా పాలనా? ప్రభుత్వ రోజువారీ కార్యకలాపాలలో ప్రజలు ఏ విధంగా భాగస్వాములు కావచ్చు? ఈ విషయాలను తరగతిగదిలోనూ, ఇంటివద్ద చర్చించండి.

తమ పనిని వివరించాలి, పనుల ప్రణాళికను ఈ శాసన సభలే ఆమోదించాలి. ప్రభుత్వం చేసిన పనికి సంబంధించిన సమాచారాన్ని ఏ పౌరుడైనా అడగవచ్చు, ఆ సమాచారాన్ని ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వానిది. అన్నిటికీ మించి నిర్ధిష్ట కాలం తరవాత మళ్లీ ఎన్నికలుంటాయి, ప్రజా ప్రతినిధులు మళ్లీ ప్రజల మద్దతును పొందవలసి ఉంటుంది. వాళ్లు చేసిన పనిని వివరించమని అడిగి, అది సంతృప్తికరంగా లేనప్పుడు ప్రజలు వాళ్ళను తిరస్కరించవచ్చు.



*చిత్రం 20.4: నీవు ఓటు వేయరాదు, ఎందుకంటే నీ జాతి వేరే*



*చిత్రం 20.5: వయోజనుడివి కాకపోతే నీవు ఓటు వేయలేవు*

**సమానత్వం, అందరినీ కలుపుకోవటంపై ప్రజాస్వామ్యం ఆధారపడి ఉంది** : ప్రజల పాలన అని అన్నప్పుడు వయోజనులైన అందరూ అని అర్థం – వాళ్లు పురుషులు కావచ్చు, స్త్రీలు కావచ్చు; ధనికులు కావచ్చు, పేద వాళ్లు కావచ్చు; నల్లవాళ్లు కావచ్చు, తెల్లవాళ్లు కావచ్చు; హిందువులు లేదా క్రిస్టియన్లు, లేదా ముస్లింలు, లేదా నాస్తికులు కావచ్చు; ఏభాష మాట్లాడేవాళ్లైనా కావచ్చు... ఈ భావన ఏర్పడటానికి చాలా కాలం పట్టింది. సూచికగా ఎన్నికలలో ఓటు చేసే హక్కును తీసుకుందాం. మొదట్లో ఆస్తి ఉన్న కొంతమంది పురుషులకు మాత్రమే ఓటు హక్కు ఉండేది. క్రమేపీ కొన్ని దేశాలలో ఈ హక్కును పేదవాళ్లకు కల్పించారు, ఆ తరవాత అది మహిళలకు లభించింది, చివరికి అన్ని మతాల, జాతుల వాళ్లకు ఓటు హక్కు లభించింది. శ్వేతజాతి మహిళలకు 1920 నుంచి మాత్రమే అమెరికా ఓటు హక్కు ఇచ్చింది. నల్లజాతీయులైన పౌరుల ఓటుహక్కుపై వివక్షతను 1965లో తొలగించింది. అన్ని వర్గాల ప్రజలకు ఓటుహక్కు కల్పించిన దేశాలలో న్యూజీలాండ్ మొదటిది. న్యూజీలాండ్‌లో అందరికీ ఓటుహక్కు 1893లో లభించింది. దీనిని సాధించటంలో మహిళలు, నల్లజాతీయులు ఉద్యమం చేపట్టారు. సార్వజనీన ఓటుహక్కు కల్పించిన తొలి పెద్ద దేశం యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్ (సోవియట్ రష్యా); 1917లోని విప్లవం తరవాత అందరికీ ఈ హక్కు లభించింది. అయితే ఈనాటికీ కొన్ని దేశాలు కొన్ని సమూహాల పట్ల వివక్షత చూపే చట్టాలు చేస్తున్నాయి:

- ఎస్తోనియా తన పౌరసత్వ చట్టాలను రూపొందించుకున్న విధానం వల్ల రష్యాకి చెందిన అల్పసంఖ్యాక ప్రజలకు ఓటు హక్కు లభించటం చాలా కష్టమైంది.


- ఫిజిలోని ఎన్నికల విధానం ప్రకారం భారతీయ–ఫిజియన్ ఓటుకంటే స్థానిక ఫిజియన్ ఓటుకి విలువ ఎక్కువ. 2013 నుంచి మాత్రమే సమాన విలువతో ఎన్నికలు జరుగుతున్నాయి.

రాజకీయ సమానత్వం, అందరినీ కలుపుకోవటం అన్న మౌలిక సూత్రంపై ప్రజాస్వామ్యం ఆధారపడి ఉంది. ప్రజాస్వామ్యంలో వయోజనులైన ప్రతి ఒక్క పౌరునికి ఒక ఓటు ఉండాలి, ప్రతి ఓటుకీ సమాన విలువ ఉండాలి.

© SCERT not to be republished

- ఈనాటికి కూడా అనేక దేశాలు ఇతర దేశాలనుంచి వలస వచ్చిన ప్రజలకు ఓటు వేసే హక్కు ఇవ్వటం లేదు. అమెరికాకి వలస వెళ్లిన దక్షిణ ఆఫ్రికా ప్రజల పరిస్థితి, ఫ్రాన్స్ లేదా జర్మనీకి వెళ్లిన టర్కిష్ ప్రజల పరిస్థితి ఇదే. భారతదేశంతో సహా ప్రపంచమంతటా వలస వెళ్లిన ఇటువంటి ప్రజలు, కాందిశీకులు కనపడతారు. ప్రజాస్వామ్య పరిపాలనలో వాళ్లు పాలుపంచుకోకూడదా? రాజకీయ సమానత్వం, అందరినీ కలుపుకోవటం అన్న మౌలిక సూత్రంపై ప్రజాస్వామ్యం ఆధారపడి ఉంది. ప్రజాస్వామ్యంలో వయోజనులైన ప్రతి ఒక్క పౌరునికి ఒక ఓటు ఉండాలి, ప్రతి ఓటుకీ సమాన విలువ ఉండాలి.

**ప్రజాస్వామ్యానికి పౌరుల క్రియాశీల భాగస్వామ్యం కావాలి :** ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికల్లో పాల్గొని, పాలకులను ఎన్నుకోవటమేనన్న ధోరణి తరచు కనపడుతుంది. కానీప్రజాస్వామ్యం అంటే ప్రభుత్వవిధానాలు,చట్టాలు తయారు చేయటంలో, వాటిని అమలు చేయటంలో కూడా ప్రజలు



చిత్రం 20.6 : ప్రజల అధికారం – ఈ చదరంగం బల్ల ఎలా మారుతుంది?

© not to be republished

భాగస్వాములు కావాలి. ఇదిఎలా సాధ్యమవుతుంది? ప్రజలందరూ బహిరంగంగా పాల్గొని తమ అవసరాలు, అభిప్రాయాలు స్పష్టంగా పేర్కొ నేలాబహిరంగ చర్చలు జరిపిన తరవాత చట్టాలు, విధానాలు రూపొందించినప్పుడు ఇది సాధ్యమవుతుంది. స్వతంత్ర పౌర సంఘాలుగా ఏర్పడి చట్టాలు, విధానాలు సమర్థంగా అమలు అయ్యేలా చూడటంలో ప్రజలు భాగస్వాములు కావాలి. అయితే ప్రజలు ఈ రకంగా భాగస్వాములు కావటం అంత తేలికగా సాధించలేం. అనేక దేశాలలో ఎన్నికైన ప్రభుత్వాలు కూడా ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించవు, పైగా దానిని అడ్డుకుంటాయి. ప్రజలు కూడా దేశ వ్యవహారాలలో అంత ఆసక్తి చూపకుండా ఉదాసీనంగా ఉండిపోతారు. ఉదాహరణకు ఎంతగానో ప్రచారం చేసిన 2012 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో 40 శాతానికి పైగా ప్రజలు తమ ఓటు హక్కును ఉపయోగించుకోలేదు.

- పరిపాలనలో భాగస్వాములు కావటం ప్రజలకు ఎందుకు ఇష్టం ఉండదు? సరైన అవగాహన లేకపోవటం వల్లనా, ఆసక్తి లేకనా, లేక తమ అభిప్రాయానికి విలువ ఉండదని భావించటం వల్లనా?

**ప్రజాస్వామ్యానికి పౌరహక్కులు ఉండాలి :** తెలుసుకోటానికి, చర్చించటానికి, స్వతంత్ర అభిప్రాయాలు ఏర్పరచుకోటానికి, వాటిని వ్యక్తపరచటానికి, సంఘాలుగా ఏర్పడి తమ భావాల అమలుకు పోరాడటానికి పౌరులకు స్వేచ్ఛ ఉన్నప్పుడే వాళ్లు నిర్ణయాలు తీసుకోవటంలో భాగస్వాములు అవుతారు. వీటినే పౌరహక్కులంటారు. అయితే ఈ హక్కులు ప్రజలకు అంత తేలికగా లభించలేదు. వాక్ స్వాతంత్ర్యం, సంఘాలుగా ఏర్పడే, ప్రభుత్వ వ్యవహారాల గురించి తెలుసుకునే ప్రజల హక్కులను నియంత్రించటానికి ప్రభుత్వాలు ప్రయత్నించాయి. ప్రభుత్వ నిర్ణయాలలో చాలా వరకు రహస్యంగా ఉంచారు. దిన పత్రికలు, పుస్తకాలను సెన్సారు చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న అభిప్రాయాలను ప్రచురించనిచ్చేవాళ్లు కాదు; ప్రజలకు తమ కాలవలసిన సంస్థ, కార్మిక సంఘం, రాజకీయ పార్టీగా ఏర్పడటానికి అనుమతినిచ్చే వాళ్లు కాదు, ఒక్క పార్టీని లేదా అధికారికంగా ఆమోదం తెలిపిన పార్టీలను మాత్రమే పనిచేయనిచ్చే వాళ్లు. సార్వజనీన ఓటు హక్కు, ప్రతి కొద్ది సంవత్సరాలకు ఎన్నికలు ఉన్నప్పటికీ రష్యా ప్రజలకు పైన పేర్కొన్న చాలా హక్కులు లేవు. అందుకే 60 సంవత్సరాలపాటు అక్కడ ఒకే పార్టీ పాలన ఉంది. ఈనాటికి కూడా అన్ని దేశాల ప్రజలకు ఈ హక్కులు లభించటం లేదు. పౌరహక్కులను పరిమితం చేయటం ద్వారా ప్రభుత్వాలు అధికారంలో కొనసాగటానికి ప్రయత్నిస్తుంటాయి.

- ప్రపంచంలో అనేక ప్రభుత్వాలు ప్రజలకు పౌరహక్కులను ఇచ్చాయి. అయితే ప్రజల ఫోనులను టాపింగ్ చేయటం, వాళ్ల ఉత్తరాలు చదవటం, వాళ్ల కార్యకలాపాలపై నిఘా ఉంచటం వంటి చర్యలు చేపడతాయి. ఇది సరైనదేనా?

**ప్రజాస్వామ్యానికి సమానత్వం కావాలి:** ప్రజాస్వామ్యానికి రాజకీయ సమానత్వం – ప్రతి వ్యక్తికీ ఒక ఓటు ఉండాలని చూశాం. అయితే ఈ రాజకీయ సమానత్వం ప్రభావం చూపాలంటే సామాజిక, ఆర్థిక హోదాలలో సైతం సమానత్వం ఉండాలి. సమాజం ధనిక–పేదలుగా, పై కులాలు–దళితులుగా విభజింపబడి ఉంటే రాజకీయసమానత్వం అర్థరహితం అవుతుంది. ఉన్నత హోదా, సంపద ఉన్న వాళ్లు తమకుఅనుకూలంగా ఓటు వేయమని మిగిలిన వాళ్లని తేలికగా ప్రభావితం చేయగలుగుతారు. చాలా కుటుంబాలలో ఆ కుటుంబానికి పెద్ద అయిన పురుషుడు మహిళలతో సహా కుటుంబ సభ్యులందరూ ఎవరికి ఓటువేయాలో నిర్ణయిస్తాడు. అమెరికా వంటి అనేక దేశాలలో అనేక ప్రసార సాధనాలు ధనిక కార్పొరేట్ సంస్థలు లేదా వ్యక్తులచేతుల్లో ఉంటాయి. దేనిని ఎక్కువగా ప్రసారం చేస్తారు, దేనిని విస్మరిస్తారు అన్న దానినిబట్టి వీళ్లు ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్దుతారు, ప్రభావితం చేస్తారు. సంపన్నులు, శక్తిమంతులకు శాసన సభ్యులు, మంత్రులు అందుబాటులో ఉంటారు కాబట్టి వాళ్ల విధానాలు, కార్యక్రమాలను ప్రభావితం చేయ గలుగుతారు.

**పట్టిక 1: ఎంపిక చేసిన కొన్ని దేశాలలో ఆదాయాలలో అసమానతలు జాతీయ ఆదాయంలో వాటా (శాతంలో)**

| *దేశం పేరు* | *పై 20%* | *కింది 20%* |
|---|---|---|
| దక్షిణాఫ్రికా | 64.8 | 2.9 |
| బ్రెజిల్ | 63.0 | 2.6 |
| అమెరికా | 50.0 | 4.0 |
| ఇంగ్లాండు | 34.5 | 9.6 |
| డెన్మార్క్ | 34.5 | 9.6 |
| హంగరీ | 34.5 | 10.0 |

- ప్రజాస్వామికంగా, ప్రజలందరి ప్రయోజనాల కోసం పని చేసే ప్రభుత్వాలు ఉన్నప్పటికి అనేక దేశాలలో తీవ్రస్థాయిలో అసమానతలు ఎందుకు కొనసాగుతున్నాయి?

© SCERT not to be republished

ఇంకోవైపున పేదలు, నిరక్షరాస్యులకు ప్రభుత్వ వర్గాలు ఈ విధంగా అందుబాటులో ఉండవు. కాబట్టి అనేక దేశాల ప్రభుత్వాలు ధనికులకు అనుకూలంగా, పేదల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండే విధానాలను అనుసరిస్తుంటాయి. కాబట్టి రాజకీయ సమానత్వంతోపాటు సామాజిక, ఆర్థిక సమానత్వం ఉంటే తప్పించి నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించలేమని చెప్పవచ్చు.

- ఒకే పార్టీ మళ్లీ, మళ్లీ అధికారంలోకి వస్తుంటే ప్రజలు ఆపార్టీనే కోరుకుంటున్నారని అర్థమా లేక ప్రత్యామ్నాయమే లేదు, లేదా ప్రత్యామ్నాయానికి ప్రజలను ఓటు వేయనివ్వడం లేదని అర్థమా? కింద ఇచ్చిన మూడు ఉదాహరణల ఆధారంగా సమాధానం ఇవ్వండి:

అ. 1930లో స్వాతంత్ర్యం వచ్చిన తరవాత మెక్సికో తమ దేశ అధ్యక్షుడిని ఎన్నుకోటానికి ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహిస్తుంది. ఈ దేశం సైనిక, లేదా నియంత పాలనలో ఎన్నడూ లేదు. కానీ 2000 సంవత్సరం వరకు ఐఆర్‌పి (ఇన్‌స్టిట్యూషనల్ రివల్యూషనరీ పార్టీ) అన్న ఒక్క పార్టీనే ప్రతీ ఎన్నికలో విజయం సాధించింది. ప్రతిపక్ష పార్టీలు పోటీ చేసేవికానీ గెలవలేక పోయేవి. ఎన్నికల్లో గెలవటానికి ఐఆర్‌పి అనేక అక్రమ పద్ధతులకు పాల్పడేది. ప్రభుత్వ పాఠశాలలో టీచర్లు ఐఆర్‌పికి ఓటు వేయమని తల్లిదండ్రులను బలవంతం చేసేవారు.

ఆ. అల్పసంఖ్యాక శ్వేత జాతీయుల పాలన నుంచి జింబాబ్వే 1980లో స్వాతంత్ర్యం పొందింది. అప్పటినుంచి దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నేతృత్వం వహించిన జాను-పిఎఫ్ అన్న పార్టీయే దేశాన్ని పాలిస్తోంది. ఆ పార్టీ నాయకుడు రాబర్ట్ ముగాబే స్వాతంత్ర్యం పొందినప్పటినుంచి అధ్యక్షుడుగా ఉన్నాడు. ముగాబేకి ఎంతో ప్రజాదరణ ఉంది, కానీ ఎన్నికలలో ఎన్నో అక్రమ పద్ధతులకు పాల్పడతాడు. అధ్యక్ష అధికారాలను పెంచుతూ, అతడు ఎవరికీ జవాబుదారీ కాకుండా చేస్తూ దేశ రాజ్యాంగాన్ని పలుమార్లు మార్చారు. ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలు వేధింపులకు గురవుతారు, వాళ్ల సమావేశాలను భంగపరుస్తారు. అధ్యక్షుడిని విమర్శించటానికి పరిమితులు విధిస్తూ ఒక చట్టం ఉంది. టెలివిజన్, రేడియోలు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. అధికారంలో ఉన్న పార్టీ కథనాలనే ఇవి ప్రసారం చేస్తాయి.

ఇ. చైనాలో దేశ పార్లమెంటు (జాతీయ ప్రజా కాంగ్రెసు)ను ఎన్నుకోటానికి ప్రతి అయిదు సంవత్సరాలకు క్రమం తప్పకుండా ఎన్నికలు జరుగుతాయి. జాతీయ ప్రజా కాంగ్రెసుకు దేశ అధ్యక్షుడిని నియమించే అధికారం ఉంటుంది. చైనా అంతటి నుంచి 3000 సభ్యులను దీనికి ఎన్నుకుంటారు. కొంతమంది సభ్యులను సైన్యం ఎన్నుకుంటుంది. ఎన్నికల్లో పోటీ చేయటానికి ముందు చైనా కమ్యూనిస్టు పార్టీ ఆమోదాన్ని అభ్యర్థి పొందాలి. 2002–03లో జరిగిన ఎన్నికల్లో చైనా కమ్యూనిస్టు పార్టీ లేదా దానితో ఒప్పందం కుదుర్చుకున్న ఎనిమిది చిన్న పార్టీల సభ్యులనే పోటీకి అనుమతించారు. కమ్యూనిస్టు పార్టీయే ప్రతిసారీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది.

**ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛాయుత ఎన్నికలు కావాలి :** ఒక దేశ ప్రజలు ప్రభుత్వంలో తమకు నిజంగా ప్రాతినిధ్యం వహించే సరైన వ్యక్తులను, లేదా పార్టీలను ఎంచుకోవాలంటే ఎన్నికలు స్వేచ్ఛగా, ఎటువంటి భయంలేని వాతావరణంలో నిర్వహించబడటం ఎంతో ముఖ్యం. అంటే ఎన్నికలలో ఏ ఒక్క పార్టీకీ ప్రత్యేక అవకాశాలు ఉండవు, ఏ పార్టీయైనా, ఏ వ్యక్తులైనా అందులో పాల్గొనగలుగుతారు. రష్యా, మయన్మార్, లిబియా వంటి అనేక దేశాలలో ఒకటి లేదా రెండు పార్టీలను మాత్రమే పోటీ చేయటానికి అనుమతిస్తారు. వాటికి ఓటు వేయటం మినహాయించి ప్రజలకు మరొక అవకాశం లేదు. ఇతర దేశాలలో కూడా ప్రజలు తమకు ఓటు వేసేలా బలవంతం చేయటానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని

© SCERT not to be republished

అధికారంలో ఉన్న పార్టీలు ఉపయోగించుకుంటాయి. ఒక్కొక్కసారి ప్రతిపక్షాల సభ్యుల నామినేషన్‌ని తిరస్కరించటం, ప్రతిపక్షాల మద్దతుదారుల పేర్లు, ఓటర్ల జాబితానుంచి తొలగించటం వంటి చర్యలకు కూడా పాల్పడతారు. ఏదో‌ఒకరకంగా ఎన్నికలు జరిపితే సరిపోదు. రాజకీయ ప్రత్యామ్నాయాల మధ్య నిజంగా ఎంపిక చేసుకునే అవకాశాన్ని ఎన్నికలు ఇవ్వాలి. ప్రజలు కావాలనుకుంటే ఈ ఎంపికను ఉపయోగించుకుని ప్రస్తుతం అధికారంలో ఉన్న వారిని తిరస్కరించవచ్చు. ప్రజాస్వామ్యాన్ని అంచనా వేయాలంటే ఎన్నికలను పరిశీలించటం చాలా ముఖ్యం. అయితే ఎన్నికలకు ముందు, తరవాత ఘటనలను కూడా పరిశీలించటం కూడా ముఖ్యం. ఎన్నికలకు ముందు రాజకీయ వ్యతిరేకతతో సహా సాధారణ రాజకీయ కార్యకలాపాలకు అవకాశం ఉండాలి. అంటే ప్రజల పౌరహక్కులను ప్రభుత్వం గౌరవించాలి. స్వేచ్ఛాయుత ఎన్నికల పునాదులపై ప్రజాస్వామ్యం నిర్మింపబడాలి.

**ప్రజాస్వామ్యానికి చట్టాన్ని, అల్పసంఖ్యాకుల అభిప్రాయాన్ని గౌరవించటం కావాలి:** ప్రజాస్వామ్యమంటే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం అన్న భావన ఉన్నప్పటికీ దాని అర్థం జనాదరణ ఉన్న నాయకులు తమ మద్దతుదారులు కోరుకున్నది చేయటం కాదు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు చట్టాలను గౌరవించాలి; చట్టాలలో పేర్కొన్నట్టు న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ స్వతంత్రంగా పని చేయటాన్ని అనుమతించాలి. ప్రజలలో భిన్నమైన అభిప్రాయాలు కలిగిన వ్యక్తులకు ప్రజాస్వామ్యం రక్షణగా ఉండాలి. ఆ అభిప్రాయాలతో అధిక శాతం ప్రజలు అంగీకరించనప్పటికీ, అటువంటి అభిప్రాయాలు కలిగి ఉండే హక్కు, వాటిని ప్రచారం చేసే హక్కు, అందుకు ఇతరులను ఒప్పించే హక్కును గౌరవించాలి. ప్రజాస్వామ్యానికి అతి పెద్ద సవాలు ప్రజాస్వామ్య వ్యతిరేక భావనలు ఉన్న ప్రజలతో – ప్రజాస్వామ్యం స్థానంలో నియంతృత్వాన్ని నెలకొల్పాలని అనుకునే వాళ్లతో, ఒక ప్రత్యేక వర్గ ప్రజలకే లేదా ప్రత్యేక ప్రాంత, జాతి ప్రజలకే అధికారం ఉండాలని భావించే వాళ్లతో వ్యవహరించటం. వాళ్ల అభిప్రాయాలను ప్రచారం చేసుకునే అవకాశం కల్పించాలా, వద్దా? ఈ రెండు అంశాలు ప్రజాస్వామ్య మరో పార్శ్వాన్ని తెలియచేస్తాయి: రాజ్యాంగ చట్టం, పౌరుల హక్కుల పరిమితులకు లోబడి ప్రజాస్వామిక ప్రభుత్వం పనిచేయాలి.

**ఎన్నికలు, ప్రజాస్వామ్యంపై కొన్ని ప్రశ్నలు**

*మన దేశంలోని ఎన్నికలను ఉదాహరణగా తీసుకుందాం. ఒక ప్రాంతంలో ఉంటున్న వాళ్లలో వెయ్యిమందికి ఓటు హక్కు ఉందని అనుకుందాం. సాధారణంగా ఎన్నికల్లో 60 శాతం ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కుని ఉపయోగించుకుంటారు. అంటే ఎన్నికల్లో 600 మంది ఓటు వేస్తారు. ఎన్నికల్లో పదిమంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని అనుకుందాం. గెలిచిన అభ్యర్థికి 250 ఓట్లు, రెండవ అభ్యర్థికి 200 ఓట్లు, మిగిలిన ఎనిమిది మందికి కలిపి 150 ఓట్లు పడ్డాయని అనుకుందాం. 250 ఓట్లు వచ్చిన వ్యక్తి గెలిచినట్లు ప్రకటిస్తారు. ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ప్రయోజనాలకు, దృక్పథాలకు గెలిచిన అభ్యర్థి ఏ మేరకు ప్రాతినిధ్యం వహిస్తారు? గెలిచిన అభ్యర్థికి ఓటర్లలో 25 శాతం మద్దతు మాత్రమే ఉంది. ఇది న్యాయమైన ప్రజాస్వామిక ఏర్పాటేనా? నిర్ణయాలు తీసుకునే సంస్థలకు ప్రజల ప్రతినిధులను ఎన్నుకోటానికి మరో విధానం ఏమైనా ఉందా?*

## ప్రజాస్వామ్యం – అధిక సంఖ్య ప్రజల వాదం X అందరినీ కలుపుకొని వెళ్లడం

ప్రజాస్వామ్యం అంటే తరచు అధిక సంఖ్యాకుల అభీష్టం మేరకు పరిపాలించటం అని పొరుకుంటాం – అంటే ఓటింగు నిర్వహించినప్పుడు ఎక్కువ మంది సమర్థించిన అభిప్రాయాన్ని అందరూ అంగీకరించాలి. అనేక చిన్న చిన్న విషయాలలో ఈ విధానం బాగానే ఉంటుంది. ఒక సమూహం లేదా

© SCERT not to be republished

ఒక వర్గ ప్రజలకు సంబంధించిన సంక్లిష్ట విషయాలలో ఇది ప్రజలను విడదీస్తుంది. ఎక్కువమంది మద్దతు ఇచ్చిన దానిని అనుసరించే విధానంతో అల్పసంఖ్యాక వర్గాలు దూరమవుతాయి. ఇటువంటి పరిస్థితుల్లో అధిక సంఖ్య, అల్ప సంఖ్య ప్రజల అవసరాలు రెండింటినీ నెరవేర్చి అందరినీ కలుపుకుని వెళ్లే విధానాన్ని అనుసరించాలి. దీనికి సంబంధించి రెండు ఉదాహరణలు చూద్దాం.


## బెల్జియం, శ్రీలంక

యరప్ ఖండంలో ఒక చిన్న దేశం బెల్జియం. ఆ దేశ జనాభాలో 59% మంది ఫ్లెమిస్ ప్రాంతానికి చెందిన డచ్ భాషా మాట్లాడే ప్రజలు మిగిలిన 40% మంది వలోనియా ప్రాంతానికి చెందిన ఫ్రెంచ్ మాట్లాడే ప్రజలు. మిగిలిన ఒక్కశాతం జర్మన్ భాష మాట్లాడే ప్రజలు. రాజధాని అయిన బ్రస్సెల్స్‌లో 80% మంది ఫ్రెంచ్ మాట్లాడే ప్రజలు ఉండగా మిగిలిన 20% మంది డచ్ భాష మాట్లాడే ప్రజలు.

ఫ్రెంచ్ మాట్లాడే ప్రజలు తక్కువ ఉన్నప్పటికీ వాళ్లు ధనికులు, శక్తిమంతులుగా ఉన్నారు. డచ్ మాట్లాడే ప్రజలకు ఇది కంటగింపుగా ఉండేది. దీనివల్ల 1950, 1960లలో డచ్ మాట్లాడే, ఫ్రెంచ్ మాట్లాడే ప్రజల మధ్య ఘర్షణపూరిత వాతావరణం నెలకొంది. రాజధాని నగరమైన బ్రసెల్స్‌లో ఈ ఘర్షణ వాతావరణం మరీ ఎక్కువగా ఉండేది. దేశం మొత్తం మీద డచ్ మాట్లడే ప్రజలు ఎక్కువగా ఉన్నప్పటికీ బ్రసెల్స్ ప్రాంతంలో వాళ్లు అల్పసంఖ్యాకులుగా ఉన్నారు.

శ్రీలంక భారతదేశానికి దక్షిణాన ఉన్న ద్వీప దేశం. శ్రీలంకలో కూడా వివిధ రకాల ప్రజలు ఉన్నారు. ఇందులో ప్రధానమైనవి సింహల మాట్లాడే వాళ్లు (74 శాతం), తమిళం మాట్లాడేవాళ్లు (18 శాతం). సింహల మాట్లాడే వాళ్లలో అధిక శాతం బౌద్ధమతస్తులు కాగా తమిళులలో హిందువులు, ముస్లింలు ఉన్నారు.

ఈ రెండు దేశాలలో ఏం జరిగిందో చూద్దాం.




*పటం 1: బెల్జియంలోని వివిధ ప్రాంతాలు, ప్రజలు*

## శ్రీలంకలో అధిక సంఖ్య ప్రజల వాదం


1948లో శ్రీలంకకి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత సింహల నాయకులు తమకు ఉన్న అధిక సంఖ్యరీత్యా ప్రభుత్వంపై ఆధిపత్యం సాధించటానికి ప్రయత్నించారు. ఫలితంగా ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వం సింహాళీయుల ఆధిపత్యాన్ని నెలకొల్పటానికి అధిక శాతం ప్రజలవాదాన్ని అమలు చేయసాగింది.

తమిళాన్ని పట్టించుకోకుండా సింహల ఒక్కదానినే అధికార భాషగా చేశారు. ఉద్యోగాలకు సింహల దరఖాస్తుదారులకు ప్రాధాన్యతనిచ్చే విధానాలను ప్రభుత్వాలు అనుసరించాయి. కొత్త రాజ్యాంగం ప్రకారం బౌద్ధమతానికి ప్రభుత్వ మద్దతు, ప్రాపకం లభించాయి. ఒకటొకటిగా చేపట్టిన ఈ చర్యల వల్ల శ్రీలంక తమిళుల్లో తాము వేరు అన్న భావం ఏర్పడింది. ఫలితంగా క్రమేపీ సింహాళీయుల, తమిళ ప్రజల మధ్య

© SCERT not to be republished

సంబంధాలు దెబ్బతిన్నాయి. సమానస్థాయి కోసం శ్రీలంక తమిళులు రాజకీయ పార్టీల ద్వారా పోరాటాలు చేపట్టారు. తమిళులు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలకు స్వయంప్రతిపత్తి కోరిక పలుమార్లు తిరస్కరింపబడింది. 1980ల నాటికి శ్రీలంక ఉత్తర, తూర్పు ప్రాంతాలతో కూడిన స్వతంత్ర 'తమిళ ఈలం' (రాష్ట్రం) కోరుతూ అనేక పార్టీలు, సంస్థలు ఏర్పడ్డాయి.

*పటం 2: శ్రీలంకలోని వివిధ జాతుల ప్రజలు*




రెండువర్గాల ప్రజల మధ్య అపనమ్మకం కారణంగా ఘర్షణలు తీవ్రమయ్యాయి, విస్తరించాయి. ఎల్‌టిటిఇ అనే తీవ్రవాద సంస్థ తమిళులు నివసిస్తున్న కొన్ని ప్రాంతాలలో స్వతంత్ర పాలన నెలకొల్పటంతో ఇది అంతర్గత పౌర యుద్ధంగా మారింది. అంతిమ యుద్ధంలో ఎల్‌టిటిఇని శ్రీలంక సైన్యం ఓడించింది. తమిళ ప్రజలను వేలాది సంఖ్యలో చంపేసి, నిర్వాసితులను చేసి శ్రీలంక సైన్యం ఆ ప్రాంతాలపై నియంత్రణ సాధించింది. ఎన్నో కుటుంబాలు దేశాన్ని వదిలి కాందిశీకులుగా మారాయి, మరెన్నో కుటుంబాలు తమ జీవనోపాధిని కోల్పోయాయి. పౌర యుద్ధానికి ముందు ఆర్థిక అభివృద్ధి, విద్య, ఆరోగ్యం వంటి వాటిల్లో శ్రీలంక చెప్పుకోదగిన ప్రగతి సాధించింది. కానీ అంతర్గత యుద్ధం కారణంగా దేశ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక జీవనం ఎంతగానో కుంటుపడింది.

## బెల్జియంలో అందరినీ కలుపుకుని వెళ్లే విధానం

బెల్జియం నాయకులు భిన్నమైన విధానాన్ని అనుసరించారు. ప్రాంతీయ బేధాలను, సాంస్కృతిక వైవిధ్యతను వాళ్లు గుర్తించారు. ఒకే దేశంలో అన్ని రకాల ప్రజలు కలసి జీవించటానికి అనువైన పరిస్థితులు కల్పించటానికి 1970, 1993 మధ్య దేశ రాజ్యాంగాన్ని నాలుగుసార్లు మార్చారు – వాళ్లు చేసుకున్న ఏర్పాట్లు చాలా సృజనాత్మకంగానూ, ఇతర దేశాల ఏర్పాట్లకు భిన్నంగానూ ఉన్నాయి. బెల్జియం అనుసరించిన విధానంలోని కొన్ని అంశాలు:

- రాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వంలో డచ్, ఫ్రెంచ్ మాట్లాడే మంత్రులు సమాన సంఖ్యలో ఉండాలి. కొన్ని ప్రత్యేకమైన చట్టాలకు ప్రతి భాషా సమూహంలోని అధిక శాతం సభ్యుల మద్దతు ఉండాలి. అంటే ఏ ఒక్క సమూహమూ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోలేదు.
- కేంద్ర ప్రభుత్వ అధికారాల్లో చాలా వాటిని దేశంలోని రెండు ప్రాంతాల రాష్ట్ర ప్రభుత్వాలకు వికేంద్రీకరించారు. కేంద్ర ప్రభుత్వం అధీనంలో రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయవు.
- బ్రసెల్స్‌కి ప్రత్యేక ప్రభుత్వం ఉంది, ఇందులో రెండు సమూహాలకు సమాన ప్రాతినిధ్యం ఉంది. డచ్ మాట్లాడే ప్రజలు కేంద్ర ప్రభుత్వంలో సమాన ప్రాతినిధ్యానికి అంగీకరించటంతో ఫ్రెంచ్ మాట్లాడే ప్రజలు బ్రసెల్స్ ప్రభుత్వంలో సమాన ప్రాతినిధ్యానికి అంగీకరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కాకుండా మూడవ ప్రభుత్వం కూడా ఉంది. ఈ 'ప్రజా ప్రభుత్వాన్ని' వాళ్లు ఎక్కడ నివసిస్తున్నప్పటికీ ఒక భాషకి చెందిన – డచ్, ఫ్రెంచ్, జర్మన్ ప్రజలు ఎన్నుకుంటారు. సంస్కృతికి, విద్యకి, భాషకి సంబంధించిన అంశాలపై ఈ ప్రభుత్వానికి అధికారం ఉంటుంది.

©SCERT not to be republished

బెల్జియం నమూనా చాలా సంక్లిష్టంగా ఉన్నట్లు మీకు అనిపించవచ్చు. కానీ ఈ ఏర్పాట్లు ఇప్పటివరకు బాగా పనిచేశాయి. రెండు ప్రధాన వర్గాల మధ్య అంతర్యుద్ధాన్ని, భాషా ప్రాతిపదికగా దేశం చీలిపోవటాన్ని అవి నివారించాయి. యూరపులోని అనేక దేశాలు యూరోపియన్ యూనియన్‌గా ఏర్పడినపుడు దానికి ప్రధాన కార్యస్థలంగా బ్రసెల్స్‌ని ఎంచుకున్నాయి. న్యాయంగా వ్యవహరిస్తుందన్న నమ్మకాన్ని బెల్జియంపై ఇది ఉంచినట్లయింది. బెల్జియం అనుసరించిన విధానానికి ఇదే గొప్ప గుర్తింపు.

బెల్జియం, శ్రీలంకల ఈ ఉదాహరణల నుంచి మనం ఏమి నేర్చుకుంటాం? రెండూ ప్రజాస్వామిక దేశాలే. అయితే అధికారాన్ని పంచుకోవటంలో రెండు దేశాలూ భిన్నమైన మార్గాలు అవలంబించాయి. వివిధ ప్రాంతాల, ప్రజల ప్రయోజనాలు, భావనలను మన్నించినపుడే దేశం ఐక్యంగా ఉంటుందని బెల్జియం నాయకులు గుర్తించారు. ఈ అవగాహన కారణంగా అధికారాన్ని పంచుకోటానికి అందరికీ ఆమోదమైన ఏర్పాట్లు చేసుకున్నారు. శ్రీలంక ఉదాహరణ ఇందుకు భిన్నంగా ఉంది. అధిక సంఖ్యలో ఉన్న ప్రజలు అధికారం పంచుకోటానికి ఇష్టపడక తమ ఆధిపత్యాన్ని ఇతరులపై రుద్దాలని ప్రయత్నించినపుడు దేశ సమైక్యత దెబ్బతింటుందని, అంతర్యుద్ధాలు, పౌరయుద్ధాలు కారణంగా దేశం వందల సంవత్సరాలు వెనకబడుతుందని ఇది నిరూపించింది.

## పౌరుల గౌరవం, స్వేచ్ఛ

వ్యక్తి గౌరవాన్ని, స్వేచ్ఛని కాపాడటంలో వివిధ రకాల ప్రభుత్వాలలో ప్రజాస్వామ్యం మెరుగైనది. ప్రతి వ్యక్తికీ తోటి మానవుల నుంచి గౌరవం పొందాలని ఉంటుంది. తనకు తగినంత మర్యాద ఇవ్వటంలేదని భావించినందువల్లనే తరచు వ్యక్తుల మధ్య ఘర్షణలు తలెత్తుతుంటాయి. గౌరవం, స్వేచ్ఛల పట్ల నిబద్ధతే ప్రజాస్వామ్యానికి పునాది. ప్రపంచ వ్యాప్తంగా ఈ విషయాన్ని కనీసం సూత్రబద్ధంగానైనా ప్రజాస్వామిక దేశాలు గుర్తించాయి. దీనిని వివిధ ప్రజాస్వామ్యాలలో వివిధ స్థాయిలలో సాధించారు. ఆధిపత్యం, పరాధీనత ఆధారంగా తరతరాలుగా నడిచిన సమాజాలలో అందరూ సమానం అని అంగీకరించటం అంత తేలికైన విషయం కాదు.

మహిళల గౌరవాన్నే తీసుకుందాం. ప్రపంచవ్యాప్తంగా అనేక సమాజాలు చారిత్రికంగా పురుషాధిపత్య సమాజాలుగా ఉన్నాయి. ప్రజాస్వామిక సమాజంలో మహిళలను గౌరవించటం, సమానులుగా చూడటం అవసరం అన్న విషయంపై మహిళలు చేసిన సుదీర్ఘ పోరాటాల కారణంగా కొంత సున్నితత్వం ఏర్పడింది. దీని అర్థం ఆచరణలో మహిళలను అన్ని సందర్భాలలో గౌరవంతో చూస్తున్నారని కాదు. కానీ ఒకసారి దీనిని సిద్ధాంత రీత్యా అంగీకరించిన తరవాత, చట్టబద్ధంగా, నైతికంగా ఆమోదయోగ్యం కానివాటికి వ్యతిరేకంగా పోరాటం చేపట్టటం మహిళలకు తేలిక అవుతుంది. అప్రజాస్వామిక వ్యవస్థలో వ్యక్తి స్వేచ్ఛ, గౌరవాలకు చట్టబద్ధ, నైతిక బలం లేనందువల్ల వాటికి భంగం కలిగినప్పుడు ప్రజల పోరాటాలకు చట్టం మద్దతు ఉండదు. కుల అసమానతలకు కూడా ఇదే వర్తిస్తుంది. సమాన హోదా, సమాన అవకాశాల కోసం వివక్షతకు గురైన, అంచులకు నెట్టివేయబడిన కులాల ప్రజలు చేస్తున్న పోరాటాలకు భారతదేశంలోని ప్రజాస్వామ్యం బలాన్ని ఇచ్చింది. ఇప్పటికీ కుల ఆధారిత అసమానతలు, అత్యాచారాలు ఉన్నాయి; కానీ వీటికి చట్టపర, నైతిక పునాదులు లేవు. ఈ కారణంగానే సామాన్య పౌరులు తమ ప్రజాస్వామిక హక్కులను అమూల్యమైనవిగా పరిగణిస్తున్నారు.

ఏ దేశంలోనైనా ప్రజాస్వామ్యాన్ని అంచనా వేయటానికి ప్రజాస్వామ్యంనుంచి ప్రజలు ఏం ఆశిస్తున్నారన్నది కూడా ప్రామాణికంగా ఉంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రత్యేకత ఏమిటంటే దానికి నిరంతరం పరీక్షలుంటాయి. ఒక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వెనువెంటనే ప్రజాస్వామ్యానికి మరొక పరీక్ష ఎదురవుతుంది. ప్రజాస్వామ్యం నుంచి ప్రజలు కొన్ని ప్రయోజనాలు పొందిన తరవాత వాళ్లు దానినుంచి మరిన్ని ఆశిస్తారు, ప్రజాస్వామ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలనుకుంటారు. అందుకే ప్రజాస్వామ్యం పనిచేస్తున్న విధానం గురించి ప్రజలను అడిగినప్పుడు వాళ్లు మరిన్ని కోరికలు పేర్కొంటారు, ఎన్నో ఫిర్యాదులు చేస్తారు. ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారంటేనే ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేస్తోందని నిరూపితమైనట్లు ప్రజలు చైతన్యవంతులయ్యారని, అధికారం ఉన్నవాళ్లు, శక్తిమంతులను నిశితంగా చూసే సామర్థ్యం వాళ్లలో పెంపొందిందని దీని అర్థం. ప్రజాస్వామ్యం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తపరచటం అంటే ప్రజాస్వామ్య పథకం విజయవంతమైనట్లు: అది ప్రజలను పాలితుల నుంచి పౌరులుగా మార్చింది. తమ ఓటువల్ల ప్రభుత్వం పని చేసే విధానం మారుతుందని, తమ ప్రయోజనాలను నెరవేరుస్తుందని ప్రస్తుతం చాలామంది పౌరులు నమ్ముతున్నారు.

- సామాజిక, మత, భాషాపర వైవిధ్యతలను కలుపుకుని వెళ్లటానికి ఈ రెండు దేశాలు అనుసరించిన మార్గాలను చర్చించండి.

## కీలక పదాలు

1. యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ (సోవియట్ రష్యా) 2. బహిరంగ చర్చలు
3. పౌర స్వేచ్ఛ 4. సామాజిక, ఆర్థిక సమానత్వం 5. అంతర్యుద్ధాలు/ అంతర్గత ఘర్షణలు

© SCERT not to be republished

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. జవాబుదారీ, బాధ్యతాయుత, చట్టబద్ధ ప్రభుత్వం ఉండేలా ప్రజాస్వామ్యం ఎలా చూస్తుంది?
2. సామాజిక వైవిధ్యతలను కలుపుకుని వెళ్లే స్వభావాన్ని ప్రజాస్వామ్యాలు ఏ స్థితిలో ప్రదర్శిస్తాయి?
3. కింద వ్యాఖ్యానాలను సమర్థించటానికి/ వ్యతిరేకించటానికి మీ వాదనలు పేర్కొనండి:

   అ. పారిశ్రామిక దేశాలు ప్రజాస్వామ్య విధానాన్ని అనుసరించగలవు, కానీ పేద దేశాలు ధనిక దేశాలు కావాలంటే నియంతృత్వం ఉండాలి.

   ఆ. పౌరుల మధ్య ఆదాయాలలో అసమానతలను ప్రజాస్వామ్యం తగ్గించలేదు.

   ఇ. పేద దేశాలలోని ప్రభుత్వాలు పేదరికం తగ్గించటం, ఆరోగ్యం, విద్యలపై తక్కువ ఖర్చు చేసి పరిశ్రమలకు, మౌలిక సదుపాయాలకు ఎక్కువ ఖర్చు చేయాలి.

   ఈ. ప్రజాస్వామ్యంలో పౌరులందరికీ ఒక ఓటు ఉంటుంది కాబట్టి ఆధిపత్యానికి, ఘర్షణలకు తావు ఉండదు.

4. ప్రజాస్వామ్యాన్ని అంచనా వేయటంలో కింద ఉన్న వాటిల్లో ఏది వర్తించదు?
   ప్రజాస్వామ్యంలో:

   అ. స్వేచ్ఛాయుత ఎన్నికలు ఆ. వ్యక్తి గౌరవం

   ఇ. అధిక సంఖ్యాకుల పాలన ఈ. చట్టం ముందు అందరూ సమానులు

5. ప్రజాస్వామ్యంలో రాజకీయ, సామాజిక అసమానతలపై అధ్యయనం ఈ కింది విషయాన్ని వెల్లడి చేస్తోంది.
అ. ప్రజాస్వామ్యం, అభివృద్ధి కలసి ఉంటాయి
ఆ. ప్రజాస్వామ్యంలో అసమానతలు ఉంటాయి
ఇ. నియంతృత్వంలో అసమానతలు ఉండవు
ఈ. ప్రజాస్వామ్యం కంటే నియంతృత్వం మంచిది

6. ఆరు దేశాలకు సంబంధించిన సమాచారం దిగువన ఉంది. ఈ సమాచారంబట్టి ఆయా దేశాలను ఏ రకంగా వర్గీకరిస్తారు? ఒక్కొక్కదాని ఎదురుగా 'ప్రజాస్వామికం' లేదా 'అప్రజాస్వామికం' లేదా 'ఖచ్చితంగా చెప్పలేం' అని రాయండి.

దేశం (అ) : దేశ అధికారిక మతాన్ని అంగీకరించని ప్రజలకు ఓటు హక్కు ఉండదు.
దేశం (ఆ) : ఒకే పార్టీ గత ఇరవై సంవత్సరాలుగా ఎన్నికలలో గెలుస్తోంది.
దేశం (ఇ) : గత ఎన్నికలలో అధికారంలో ఉన్న పార్టీ ఓడిపోయింది.
దేశం (ఈ) : సైన్యాధిపతి ఆమోదం లేకుండా సైన్యానికి సంబంధించిన చట్టాన్ని పార్లమెంటు చేయలేదు.
దేశం (ఉ) : న్యాయవ్యవస్థ అధికారాలను తగ్గిస్తూ పార్లమెంటు చట్టం చేయలేదు.
దేశం (ఊ) : దేశానికి సంబంధించి ముఖ్య ఆర్థిక నిర్ణయాలన్నీ కేంద్ర బ్యాంకు అధికారులు తీసుకుంటారు, వీటిని మంత్రులు మార్చలేరు.

7. కింద ఉన్న ప్రతి వాక్యంలో ప్రజాస్వామిక, అప్రజాస్వామిక అంశాలు ఉన్నాయి. ప్రతి వాక్యానికి ఆ రెండింటినీ వేరుగా రాయండి.
అ. ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్ణయించిన నియంత్రణలకు లోబడి పార్లమెంటు కొన్ని చట్టాలు చేయాలని మంత్రి చెప్పారు.
ఆ. పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరిగిందని నివేదికలు వచ్చిన నియోజకవర్గంలో మళ్లీ ఎన్నికలను నిర్వహించ వలసిందిగా ఎన్నికల సంఘం ఆదేశించింది.
ఇ. పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం ఏనాడూ 10 శాతం మించలేదు. ఈ కారణంగా పార్లమెంటులో మూడవ వంతు సీట్లు మహిళలకు కేటాయించాలని మహిళా సంఘాలు ఉద్యమం మొదలు పెట్టాయి.

8. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఉన్న కింది వాదనలకు మీ ప్రతిస్పందన రాయండి:
అ. దేశంలో అత్యంత క్రమశిక్షణ ఉండి, అవినీతిలేని వ్యవస్థ సైన్యం ఒక్కటే. కాబట్టి దేశాన్ని సైన్యం పరిపాలించాలి.
ఆ. అధిక సంఖ్యాకుల పాలన అంటే ఏమీ తెలియని ప్రజల పాలన. తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ మనకి కావలసింది విజ్ఞుల పాలన.
ఇ. ఆధ్యాత్మిక విషయాలలో మతగురువుల మార్గదర్శనం కోరుకున్నప్పుడు రాజకీయాల్లో కూడా మార్గదర్శనం చేయమని ఎందుకు అడగకూడదు? దేశాన్ని మతగురువులు పరిపాలించాలి.

9. ప్రపంచ పటంలో ఈ క్రింది దేశాలను గుర్తించండి.
అ. శ్రీలంక  ఆ. బెల్జియం  ఇ. రష్యా  ఈ. అమెరికా (యుఎస్ఎ)

10. 'పౌరుల గౌరవం, స్వేచ్ఛ' అన్న శీర్షిక కింద మొదటి రెండు పేరాలు చదివి దిగువ ప్రశ్నకు సమాధానం ఇవ్వండి:
ప్రజాస్వామిక దేశంలో పౌరుల గౌరవం, స్వేచ్ఛ గురించి రాయండి.

11. ప్రజలు ప్రజాస్వామ్యం కొరకు పోరాడటానికి గల కారణాలను తెల్పండి.

## ప్రాజెక్టు

మీ టీచరు సహాయంతో తరగతి ప్రతినిధిని ఎన్నుకోటానికి తరగతిలో ఎన్నికలు నిర్వహించండి.

© SCERT not to be republished

పాఠం 21

# మానవ హక్కులు, ప్రాథమిక హక్కులు

ఇంతకు ముందు అధ్యాయంలో ఇతరులతో సమానత్వం సాధించటానికి ప్రజలు చేసిన వివిధ పోరాటాల గురించి చూశాం. అయినాగాని, స్వాతంత్ర్యం వచ్చిన తరవాత కూడా వివక్షత రూపాలు పూర్తిగా అంతరించి పోలేదు. అన్ని రకాల వివక్షతలను రూపుమాపటం అంత తేలిక కాదని మన రాజ్యాంగ రూపకర్తలు గుర్తించారు. అందుకే సమాజ వివిధ అవసరాలు, లక్ష్యాల దృష్ట్యా అనువైన చట్టాలు తయారుచేయటానికి వీలు కల్పించే రాజ్యాంగాన్ని తయారుచేశారు. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న సూత్రాల ఆధారంగా సమాజం ఉండాలని రాజ్యాంగం ఆశించింది. ఈ పీఠికకు విరుద్ధంగా ఉన్న చట్టాలను కొట్టివేస్తారు.

- గత సంవత్సరం మీరు చదివిన రాజ్యాంగ పీఠికలోని ముఖ్యమైన కొన్ని అంశాలను రాయండి...

## హక్కులు అంటే ఏమిటి?

వ్యక్తుల హేతుబద్ధ కోరికలు హక్కులు అవుతాయి. ఈ కోరికలకు చట్టంనుంచి రక్షణ ఉంటుంది. మనందరికీ ఇతరులకంటే తక్కువగా చూడబడకుండా సంతోషంగా జీవించాలని ఉంటుంది. అదేవిధంగా ఇతరులు తమ హక్కులను అనుభవించనిచ్చే బాధ్యత మనమీద ఉంటుంది. ఇతరుల హక్కులను గౌరవించి, రక్షించే బాధ్యతతోపాటు మీకు హక్కులు లభిస్తాయి.

సమాన హక్కులు అన్న భావన నిరంతరం మారుతూ వస్తోంది. అన్ని కాలాల్లో అందరూ సమానంగా చూడబడలేదని మనం ఇంతకుముందు చూశాం. నల్లజాతీయులను బానిసలను చేసి అమ్మారు, మహిళలకు ఆస్తి హక్కు ఇవ్వలేదు వంటివి కొన్ని ఉదాహరణలు. కానీ ప్రస్తుతం వీటిని అన్యాయాలుగా, వ్యక్తి హక్కుల ఉల్లంఘనగా పరిగణిస్తాం.


ప్రజాస్వామిక వ్యవస్థ నేపథ్యంలో కూడా హక్కులు ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. అందరినీ సమానంగా ఉంచటానికి ప్రజాస్వామిక వ్యవస్థలు నిరంతరం శ్రమిస్తూ ఉంటాయి. ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తరపరచటానికి, తమకు నమ్మకమున్న వ్యక్తులను తమకు ప్రతినిధులుగా ఎన్నుకునే అవకాశంతో సహా ఎంపిక చేసుకోటానికి ప్రజాస్వామికం అనుమతిస్తుంది. ఈ ఎంపికను ఓటు అంటారు.

ప్రజాస్వామ్యం కేవలం అధిక సంఖ్యాకులకే కాక అల్పసంఖ్యాకులకు కూడా రక్షణ కల్పిస్తుంది. అధిక సంఖ్యాకులైనా, అల్పసంఖ్యాకులైనా అందరినీ ప్రజాస్వామ్యం ఒకే తలంమీద ఉంచుతుంది. కులం, జాతి, లింగ, మత బేధం లేకుండా వ్యక్తులందరి హక్కులను భారత రాజ్యాంగం కాపాడుతుంది. అయితే వ్యక్తికి మౌలికమైన కొన్ని హక్కులు ఉన్నాయి, వీటికి రాజ్యాంగంలో ప్రత్యేక స్థానం ఇచ్చారు. ఈ హక్కులను ప్రాథమిక హక్కులంటారు.

ఈ హక్కులు ఎంతో ముఖ్యమైనవి: ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రజాస్వామిక దేశాలు కూడా వీటిని ప్రకటించాయి. వీటిని ఐక్యరాజ్యసమితి విశ్వవ్యాప్త మానవ హక్కుల ప్రకటనగా క్రోడీకరించింది. ఈ ప్రకటనపై అనేక ఆధునిక దేశాలు సంతకం చేసి ఇందులో పేర్కొన్న మౌలిక మానవ హక్కులను తాము కూడా కాపాడతామని పేర్కొన్నాయి.

© SCERT not to be republished

## భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు



చిత్రం 21.1: ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంలోని మూడవ భాగంలో ప్రాథమిక హక్కులను పేర్కొన్నారు. అణచివేతకు పాల్పడే ప్రభుత్వాల నుంచి ప్రజలకు ఈ హక్కులు రక్షణనిస్తాయి. వీటిని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఇవి ఎంత ముఖ్యమైనవంటే ఇవి ఉల్లంఘింపబడినప్పుడు ఏ వ్యక్తి అయినా న్యాయం కోసం కింది న్యాయస్థానాలకు వెళ్లకుండా హైకోర్టును గానీ, దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని గానీ నేరుగా ఆశ్రయించవచ్చు. రాజ్యాంగ హక్కులను కాపాడటానికి, అమలు అయ్యేలా చూడటానికి ప్రభుత్వానికి న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసే అధికారాన్ని 'రిట్' అంటారు. ఇది న్యాయస్థానాలకు స్వతహాగా లభించే హక్కు. ఏదైనా ప్రాథమిక హక్కు ఉల్లంఘింపబడినప్పుడు న్యాయస్థానం తనంతట తాను ('సు మోటో') విచారణ చేపట్టవచ్చు, ఆదేశాలు జారీ చేయవచ్చు.

© SCERT not to be republished

## సమానత్వపు హక్కు

భారత రాజ్యాంగం సమానత్వానికి హక్కు ఇస్తోంది. ఇందులో ఈ కింద పేర్కొన్న ముఖ్యమైన హక్కులు ఉన్నాయి:

### 1. చట్టరక్షణలో సమానత్వం

ప్రభుత్వం "ఏ వ్యక్తికీ చట్టం ముందు సమానత్వాన్నీ, చట్టాల రక్షణలో సమానత్వాన్ని తిరస్కరించగూడదు" అని రాజ్యాంగం పేర్కొంటోంది. దీని అర్థం చట్టాలు అందరికీ, ఆ వ్యక్తి ఆదాయం, హోదా, నేపథ్యం వంటి వాటితో సంబంధం లేకుండా వర్తిస్తాయి. దీనిని సమన్యాయపాలన అంటారు.

సమానత్వపు హక్కు పౌరులందరికీ – వాళ్లు సామాన్య పౌరులు కావచ్చు, మంత్రి కావచ్చు, ప్రభుత్వ అధికారి కావచ్చు, చిన్న రైతు కావచ్చు – చట్ట రక్షణ సమానంగా లభిస్తుంది. అందరూ ఒకే చట్టం కింద ఉన్నారు. దీని అర్థం భారతీయ పౌరులను వారి కులం, వర్ణం, లింగ, మతం, హోదా, జన్మస్థలం వంటి వాటి ఆధారంగా ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వకూడదు, వివక్షత చూపకూడదు.

ప్రధాన మంత్రిని కూడా న్యాయస్థానంలో విచారించవచ్చు, ఏదైనా నేరారోపణ ఉన్నప్పుడు అతడు కూడా మామూలు పౌరుడి మాదిరి న్యాయస్థానానికి హాజరు కావాలి. అదే విధంగా ఒక అధికారి నిందితుడని నిరూపితమైతే అందరిలాగానే అతడికి కూడా శిక్షపడుతుంది. తన వర్గం, లేదా నేపధ్యాన్ని బట్టి ప్రత్యేకంగా చూడాలని ఎవరూ అడగలేరు.

ఆధునిక రాజ్యంలో ప్రభుత్వ కార్యనిర్వాహక విభాగానికి విస్తృత అధికారాలు ఉన్నాయి – అనేక విధులతో పాటు నియమ, నిబంధనలను అమలుచేసే బాధ్యత దీనికి ఉంది. ఈ అధికారాన్ని వినియోగించుకోవటంలో వివిక్షత చూపకుండా సమానత్వ అధికరణం చూస్తుంది.

## 2. సామాజిక సమానత్వం

ఈ హక్కులో మరొక అంశం సామాజిక సమానత. మతం, జాతి, కులం, వర్గం, జన్మస్థానం వంటివాటి ఆధారంగా ప్రభుత్వం పౌరుల పట్ల వివక్షత చూపకూడదు. వీటి ఆధారంగా పౌరులను దుకాణాలు, రెస్టారెంట్లు, బావులు, చెరువులు, రహదారులు పూర్తిగా లేదా పాక్షికంగా ప్రభుత్వ నిధులతో నిర్వహింపబడుతున్న ప్రజా విహార ప్రదేశాలు, ప్రజలకు/ దేశానికి అంకితం చేసిన ఇతర సదుపాయాలను ఉపయోగించుకోటాన్ని అడ్డుకోకూడదు. ఈ అధికరణం ప్రత్యేకత ఏమిటంటే మతం, జాతి, కులం, లింగ ఆధారంగా ప్రభుత్వం ఏ రూపంలోనూ వివక్షత చూపకుండా హామీ ఇస్తుంది.

ఈ హక్కును అమలు చేసేటప్పుడు చెప్పుకోదగ్గ రెండు మినహాయింపులు ఉన్నాయి. మహిళలు, పిల్లలకు ప్రయోజనం జరిగేలా కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు ప్రభుత్వం చేయటం మొదటిది. రెండవది షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజలు, సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన తరగతుల ప్రగతికి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాటు చేయవచ్చు.

మహిళలు, పిల్లలకోసం చేసిన ప్రత్యేక ఏర్పాట్లు ప్రజలందరి, దీర్ఘకాల ప్రయోజనాల కోసం ఉద్దేశించినవి. సామాజిక సంప్రదాయాలు, మొత్తంగా దేశనేపధ్యాన్ని ఇది పరిగణనలోకి తీసుకుంటుంది, ఈ బృంద ప్రజలు చారిత్రకంగా అణచివేయబడ్డారని, అధికారాలు కోల్పోయారని గుర్తిస్తుంది. ఈ హక్కును కాపాడటానికి పౌర వ్యవహారాలకు సంబంధించిన ఆస్తి చట్టాల వంటి వాటిని మార్చి ఉమ్మడికుటుంబ ఆస్తిలో మహిళలను సమష్టి వారసులుగా చేశారు.

అంటే రాజ్యాంగం వివక్షతతో ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో, విద్యాసంస్థలలో రిజర్వేషన్‌కు అవకాశం కల్పిస్తోంది. ఏ మేరకు రిజర్వేషను కల్పిస్తారన్నది పౌరులకు, సాధారణ ప్రజలకు, ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమవుతుంది. ఉదాహరణకు వైద్య కళాశాలల విద్యార్థులలో కొంత శాతం వెనకబడిన తరగతులు/ షెడ్యూల్డ్ కులాలు/ షెడ్యూల్డ్ తెగలతో నింపాలి.

## 3. అవకాశాలలో సమానత్వం

ప్రభుత్వంలో నియామకాలకు, లేదా ఉపాధికి సంబంధించిన విషయాలలో పౌరులందరికీ రాజ్యాంగం సమాన అవకాశానికి హామీ ఇస్తోంది. కేవలం మతం, జాతి, కులం, లింగ, వారసత్వం, జన్మస్థానం, నివాస స్థానం కారణంగా ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హులు కాకూడదు, వివక్షతకు గురి కాకూడదు.



© SCERT not to be republished

అయితే దీనికి కూడా ఒక ప్రత్యేక మినహాయింపు ఉంది. ప్రభుత్వ ఉద్యోగాలలో తగినంత ప్రాతినిధ్యం లేదని భావించే వెనకబడిన పౌరులకు అనుకూలంగా కొన్ని ఉద్యోగాలను ప్రభుత్వం రిజర్వు చేయవచ్చు. అంటే సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతికీ, సాధికారీకరణకు ప్రభుత్వ ఉద్యోగాలలో తగినంత ప్రాతినిధ్యంలేని వెనకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు కొన్ని ఉద్యోగాలను రిజర్వు చేయవచ్చు.

### 4. అస్పృశ్యత నిషేధం

ఏ రూపంలోనైనా అంటరానితనాన్ని రాజ్యాంగం నిర్ద్వందంగా రద్దు పరిచింది. అంతేకాకుండా ఎవరైనా అస్పృశ్యతను పాటిస్తే అది నేరం అవుతుంది, అందుకు పాల్పడినవాళ్లు చట్టరీత్యా శిక్షార్హులు, వాళ్లకి జైలుశిక్ష కూడా పడవచ్చు. ఒక వ్యక్తిని ఒక ప్రార్థనా స్థలంలోకి ప్రవేశించనివ్వకపోయినా, చెరువు, బావి నుంచి నీళ్లు తీసుకోనివ్వకపోయినా ఆ వ్యక్తులకు పౌరహక్కుల రక్షణ చట్టం శిక్షను పేర్కొంది.

### 5. బిరుదుల రద్దు

రాచరిక వర్గాన్ని, బూర్జువాలను ఇష్టమొచ్చినట్లు, అసమానంగా విభజించటాన్ని తొలగిస్తూ భారత ప్రభుత్వం ఎటువంటి బిరుదులు ఇవ్వకుండా రాజ్యాంగం నిషేధం విధించింది. రాయి బహద్దూర్, ఖాన్ బహద్దూర్ పేర్లతో భారతదేశంలో ఒక రాచరిక వర్గాన్ని బ్రిటిష్ ప్రభుత్వం తయారుచేసింది – ఈ బిరుదులను సైతం రాజ్యాంగం నిషేధించింది. భారతదేశ పౌరులు ఇతర దేశాల బిరుదులను తీసుకోకూడదు. అయితే భారతదేశ పౌరులు సైనిక, పౌర పతకాలు పొందవచ్చు. భారత రత్న, పరమ వీర చక్ర, పద్మ విభూషణ్ వంటి పతకాలు పొందినవాళ్లు వాటిని బిరుదుగా ఉపయోగించుకోకూడదు, కాబట్టి ఇవి రాజ్యాంగ నిషేధ పరిధిలోకి రావు.

- ఏ రకమైన సమానత్వపు హక్కులకు రాజ్యాంగం హామీ ఇస్తోంది? ఉదాహరణలు ఇవ్వండి.
- సమానత్వపు ప్రాథమిక హక్కును కింద పేర్కొన్నవి ఉల్లంఘిస్తున్నాయేమో చర్చించండి. ఇలా చేయటం రాజ్యాంగ రీత్యా సరైనదో, కాదో చర్చించండి.

  – వీధిలోని నల్లా (కుళాయి) నుండి నీళ్లు పట్టుకుంటున్నప్పుడు మరొక వ్యక్తి కుండ తన కుండకు తగిలిందని ఒక వ్యక్తి గొడవపెట్టుకున్నాడు.

  – కొన్ని వర్గాల ప్రజలను ఊరిలో కాకుండా ఊరిబయట మాత్రమే ఉండటానికి అనుమతిస్తారు.

  – ప్రార్థనా స్థలాలకు వెళితే తమను అవమానిస్తారనీ, లేదా కొడతారనీ చాలా సమూహాల ప్రజలు అక్కడకు వెళ్లరు.

- రాజ్యాంగంలో సమానత్వపు ప్రాథమిక హక్కు లేకపోతే ఏమవుతుంది? చర్చించండి.

© SCERT not to be republished

## స్వాతంత్ర్యపు హక్కు

రాజ్యాంగ నిర్మాతలు ముఖ్యమని భావించిన కొన్ని వ్యక్తిగత హక్కులకు భారత రాజ్యాంగం హామీ ఇస్తోంది. స్వాతంత్ర్యపు హక్కు కింద ఈ క్రింది ఆరు స్వేచ్ఛలకు హామీ లభిస్తోంది:

**1. వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ:** దీని వల్ల వ్యక్తులకు ప్రజా కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం లభిస్తుంది. సమావేశాలు, ప్రచురణలు, నాటకాలు, చిత్రలేఖనం వంటి వివిధ రూపాల ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చు. అయితే ఈ రకమైన హక్కు పరిమితమైన హక్కు; శాంతి భద్రతలు, ప్రభుత్వ భద్రత, నైతికత, ప్రజాహితం వంటి కారణాలతో ఈ హక్కును పరిమితం చేయవచ్చు. ఉదాహరణకు ప్రజాహితం, మర్యాద, నైతికతల దృష్ట్యా సినిమాలు సెన్సారు బోర్డు ద్వారా సమీక్షింపబడతాయి.

వాక్ స్వాతంత్ర్యాన్ని నియంత్రించే అనేక చట్టాలు ఉన్నాయి. వాక్ స్వాతంత్ర్యం ఉన్నప్పటికీ ఏమాత్రం ఆలోచించకుండా మాట్లాడటానికి లేదు. మన వాక్ స్వాతంత్ర్యం ఇతరులను దూషించేదిగా, అనైతికమైనదిగా, చట్ట విరుద్ధమైనదిగా ఉండకూడదు. ఇతరులను రెచ్చగొట్టకుండా/ ప్రభుత్వంపై తిరుగుబాటును ప్రేరేపించకుండా ప్రజలను నిషేధించే చట్టాలు ఉన్నాయి.

**2. ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు:** శాంతిభద్రతల దృష్ట్యా, దేశ సార్వభౌమికత, సమగ్రతల దృష్ట్యా ఈ హక్కుపై ప్రభుత్వం కొన్ని పరిమితులను విధించవచ్చు.

తమ హక్కుల గురించి మాట్లాడుకోటానికి, తమ సమస్యలు లేదా వ్యాపారం గురించి చర్చించుకోటానికి, లేదా తమ ఆలోచనలు, దృక్పథాలు పంచుకోటానికి వంటి అనేక కారణాలతో సమావేశమయ్యే హక్కు ప్రజలకు ఉంది. శాంతియుతంగా ప్రదర్శనలు, బహిరంగ సభలు, ఊరేగింపులు నిర్వహించటానికి ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది. అయితే ఈ హక్కుపై కొన్ని పరిమితులు ఉన్నాయి.


*చిత్రం 21.2: ఒక ప్రదర్శన*

ఉదాహరణకు ఏ సమావేశం అయిన శాంతియుతంగా ఉండాలి. ఎటువంటి ఆయుధాలు ఉపయోగించకూడదు, ప్రదర్శించ కూడదు. అదే విధంగా ఏదైనా నిరసన, ఊరేగింపు నిర్వహించేటపుడు పాలనా విభాగం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి.

**3. సంఘాలు, సభలుగా ఏర్పడే హక్కు:** శాంతిభద్రతలు, నైతికత, దేశ సార్వభౌమికత, సమగ్రతల దృష్ట్యా ఈ హక్కుపై ప్రభుత్వం కొన్ని పరిమితులు విధించవచ్చు.

ప్రజలు – సాంస్కృతిక, వ్యాపార, కార్మిక వంటి సంఘాలు, సభలుగా ఏర్పడవచ్చు. ఉదాహరణకు అనేక కర్మాగారాలలో కార్మిక సంఘాల గురించి మీరు విని ఉంటారు. ఈ సంఘాలు కార్మికుల సమస్యల గురించి చర్చించటానికి సమావేశాలు నిర్వహిస్తాయి. కర్మాగార యజమానుల ముందు తమ కోరికలను ఉంచుతాయి. ఈ విధంగా కార్మిక సంఘం కార్మికుల హక్కులను కాపాడుతుంది.

- మీ ప్రాంతాలలో ఎటువంటి సంఘాలు ఉన్నాయి?
- కార్మిక సంఘాల అవసరం ఏమిటి? అవి ఎదుర్కొనే సమస్యలు ఏమిటి?

**4. స్వేచ్ఛగా సంచరించే హక్కు:** భారతదేశంలో ఎవ్వరైనా, ఎక్కడికైనా వెళ్లవచ్చు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ హక్కుపై కొన్ని పరిమితులు విధించవచ్చు. ఉదాహరణకు అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టటానికి ప్రయాణాలపై పరిమితులను విధించవచ్చు. అదేవిధంగా కొన్ని సరిహద్దు ప్రాంతాలలో స్వేచ్ఛా సంచారం వల్ల దేశ భద్రతకు ముప్పుగా ఉందని భావిస్తే కొన్ని పరిమితులను విధించవచ్చు.

**5. భారతదేశంలో ఎక్కడైనా నివసించటానికి, స్థిరపడటానికి హక్కు:** సాధారణ ప్రజానీక ప్రయోజనాల దృష్ట్యా లేదా షెడ్యూల్డ్ తెగల దృష్ట్యా ఈ హక్కుపై ప్రభుత్వం కొన్ని పరిమితులు విధించవచ్చు. ఆదివాసీ, గిరిజన ప్రజలు దోపిడీకి, బలప్రయోగానికి గురికాకుండా రక్షించటానికి కొన్ని పరిమితులు విధించారు.

- ప్రజలు దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి ఎందుకు స్థిరపడాలనుకుంటారు?
- పట్టణంలో పనిదొరికి, ఉండటానికి సరైన ఇల్లులేని వాళ్లపట్ల ప్రభుత్వ బాధ్యత ఏమిటి?

**6. ఏ వృత్తి అయినా, ఉపాధి, వాణిజ్యం, వ్యాపారమైనా చేపట్టే హక్కు:** ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ హక్కుపై ప్రభుత్వం పరిమితులు విధించవచ్చు. ఉదాహరణకు అనైతికమైన, ప్రమాదకరమైన వ్యాపారం చేపట్టే హక్కు వ్యక్తులకు లేదు. అదే విధంగా ఏదైనా వృత్తి, లేదా వ్యాపారం చేపట్టటానికి వృత్తిపర, సాంకేతిక అర్హతలను సిఫారసు చేయవచ్చు.

పైన పేర్కొన్న ఈ హక్కులపై రాజ్యాంగం కూడా కొన్ని పరిమితులను విధిస్తుంది. భారతదేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, సమగ్రతల దృష్ట్యా ఈ ఆరు స్వేచ్ఛలపై ప్రభుత్వం కొన్ని పరిమితులు విధించవచ్చు. శాంతిభద్రతలు, నైతికతల దృష్ట్యా కూడా ప్రభుత్వం కొన్ని పరిమితులను విధించవచ్చు. అత్యవసర స్థితి ప్రకటించినప్పుడు ఈ ఆరు స్వేచ్ఛలు తాత్కాలికంగా రద్దు అవుతాయి, లేదా కొన్ని పరిమితులు విధింపబడతాయి. అయితే జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలను తాత్కాలికంగా కూడా రద్దు చేయటానికి లేదు.

- ■ ఆరు స్వేచ్ఛలను తాత్కాలికంగా రద్దు చేయవచ్చు కానీ జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలను తాత్కాలికంగా కూడా రద్దు చేయలేరు అన్న వాక్యం అర్థాన్ని చర్చించండి.

**7. జీవించేహక్కు :** రాజ్యాంగం జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలకు హామీ ఇస్తోంది. దీనికింద ఈ దిగువ పేర్కొన్నవి ఉంటాయి:

■ జీవించే, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులో భాగంగా నేరానికి శిక్ష విషయంలో రక్షణను హామీ ఇస్తోంది. దీని అర్థం దేశంలో ఆ సమయానికి అమలులో ఉన్న చట్టం సూచించిన శిక్షకు మించి శిక్ష వేయటానికి లేదు.

■ జీవం, వ్యక్తిగత స్వేచ్ఛలకు రక్షణను జీవించే, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులో కూడా పేర్కొన్నారు. అంటే చట్టం ద్వారా తప్పించి ఏ వ్యక్తి జీవితానికీ, వ్యక్తిగత స్వేచ్ఛకీ భంగం కలిగించకూడదు. దీని అర్థం ఒక వ్యక్తి నేరం చేసినప్పుడు మాత్రమే అతడి జీవించే, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు పరిమితం చేయబడుతుంది. అయితే జీవించే హక్కు కింద మరణించే హక్కు లేదు. కాబట్టి ఆత్మహత్య చేసుకోవటం, లేదా అందుకు ప్రయత్నించటం నేరం అవుతాయి.

© SCERT not to be republished

- కింద పేర్కొన్న వాటిల్లో వాక్ స్వాతంత్ర నియంత్రణపై చర్చ నిర్వహించండి.

1. ఒక కులం ప్రజల భావాలను గాయపరిచే ఉద్దేశంతో ఒక పుస్తకం రాశారు.
2. ప్రతి సినిమాకి విడుదలకు ముందు సెన్సారు బోర్డునుంచి ఆమోదం పొందాలి.
3. రాత్రి 11 గంటలు దాటిన తరవాత పండగలు, ప్రార్థనల రోజులలో ఎవరూ మైకు వాడకూడదని న్యాయస్థానం ఆదేశించింది.

- ఎనిమిదవ తరగతిలో చదివిన పోలీసులు, న్యాయస్థానాల పాత్రలలో తేడాలు ఏమిటి?
- మీ ప్రాంతంలో ఏఏ రకాల పాఠశాలలు ఉన్నాయి? ఇన్ని రకాల పాఠశాలలు ఎందుకు ఉన్నాయి?

■ 2002లో జీవించే హక్కులో విద్యాహక్కు కూడా భాగమైంది. దీని ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల వయసు పిల్లలకు ప్రభుత్వం ఉచిత, నిర్బంధ విద్యను కల్పించాలి. దీని ప్రకారం అవసరమయ్యే పాఠశాలలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, తమ పిల్లలు క్రమం తప్పకుండా బడికి హాజరు అయ్యేలా చూసే బాధ్యత తల్లిదండ్రులది. భవిష్యత్తులో తమ అవకాశాలను మెరుగు పరుచుకోటానికి, సమాజానికి సృజనాత్మకంగా దోహద పడటానికి పిల్లలందరికీ చదువుకునే అవకాశం, తమ చుట్టూ ఉండే ప్రపంచం గురించి తెలుసుకునే అవకాశం, తమ భావ వ్యక్తీకరణకు కావలసిన నైపుణ్యాలను సమకూర్చుకునే అవకాశం ఉండాలని ప్రజలు భావించటం వల్ల ఈ హక్కును జోడించారు.

■ సాధారణ పరిస్థితులలో అరెస్టు అయిన వ్యక్తి హక్కులను జీవించే, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులలో పేర్కొన్నారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పకుండా ఎవరినీ అరెస్టు చేయకూడదు. అరెస్టు అయితే ఆ వ్యక్తి తను ఎంచుకున్న లాయరు ద్వారా వాదించే హక్కు ఉంది.

## పీడనాన్ని నిరోధించే హక్కు

ఈ హక్కుకింద అన్ని రకాల "బలవంతపు చాకిరీలు నిషేధింపబడ్డాయి."

చరిత్ర అధ్యాయాలలో ప్రజలతోటి బలవంతంగా ఎటువంటి వేతనం లేకుండా కొంతమంది వెట్టి పని చేయించేవారని చదివారు. ప్రస్తుతం ఒక భూస్వామి లేదా గుత్తేదారు వేతనం లేకుండా, లేదా చాలా తక్కువ వేతనానికి బలవంతంగా ఎవరితోనైనా పని చేయిస్తుంటే అది దోపిడీకి గురి కాకుండా ఉండే ప్రాథమిక హక్కుకి ఉల్లంఘన అవుతుంది. అలా దోపిడీకి గురి అవుతున్న వ్యక్తి న్యాయస్థానంలో దావా వేయవచ్చు. అదే విధంగా కట్టుబానిసగా ఏ వ్యక్తితోనైనా బలవంతంగా పని చేయిస్తే అది ఈ హక్కును ఉల్లంఘించినట్లు అవుతుంది.

## "కర్మాగారాలలో బాలలను పనిలో పెట్టుకోవటం నిషేధం"

"14 సంవత్సరాలలోపు బాలలను కర్మాగారాలు, గనులు, ఇతర ప్రమాదకరమైన పనులలో పెట్టుకోవటం నిషేధం" అని రాజ్యాంగం పేర్కొంటోంది. దీనికి అనుగుణంగా అగ్గిపెట్టెలు, టపాకాయలు, బీడీలు, తివాచీల తయారీ, అద్దకం వంటి పనులలో పిల్లలను పనిలో పెట్టుకోవటాన్ని నిషేధిస్తూ చట్టాలు చేశారు.

- మీ ప్రాంతంలో ఈ రకమైన హక్కులు పిల్లలకు కల్పించబడుతున్నాయని నీవు భావిస్తున్నావా?
- ఉపాధ్యాయుడి సహాయంతో రాష్ట్రంలోని కనీస వేతనాలను తెలుసుకోండి.

© SCERT not to be republished

## మత స్వాతంత్ర్యపు హక్కు

పౌరులందరూ తమ అంతరాత్మను అనుసరించి ఏ మతాన్ని అయినా అవలంబించే హక్కు కలిగి ఉన్నారు. వ్యక్తిగా తన మత ఆచారాలను పాటించకుండా ఏ వ్యక్తినీ నిషేధించలేరు. ఈ హక్కు ప్రకారం ఒక వ్యక్తి తన మతాన్ని మార్చుకోవాలని నిర్ణయించుకోవచ్చు. భారతదేశంలో లౌకికవాద స్ఫూర్తిని ఈ హక్కు కాపాడుతుంది. ఉదాహరణకు మతం పేరుతో ఏ వ్యక్తీ సతీసహగమన నేరానికి పాల్పడలేరు. అదేవిధంగా మతపర స్వేచ్ఛ అంటూ ఎవరూ 'సతి' సహగమనాన్ని ప్రోత్సహించటానికి లేదు.

రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వానికి ఏ మతమూ లేదు. ఇంతకు ముందు పేర్కొన్నట్లు అది అన్ని మతాలను సమానంగా చూడాలి. భారతదేశం లౌకిక దేశం అని పీఠికలో పేర్కొన్నప్పుడు రాజ్యాంగ ఉద్దేశం ఇదే.

- సతీసహగమనాన్ని ఆచరించటం వల్ల ప్రాథమిక హక్కులకు ఏ విధంగా భంగం కలుగుతుంది?
- ఒక వ్యక్తి అనుకుంటే ఏ మతమూ అవలంబించకుండా ఉండవచ్చా?



*చిత్రం 21.3: వివిధ మతాల ప్రజలు, ప్రార్థనా స్థలాలు*

## సాంస్కృతిక, విద్యా విషయక హక్కు

"భాషాపరమైన, మతపరమైన అల్పసంఖ్యాక వర్గాలకు తాము ఎంచుకున్న విద్యాసంబంధ సంస్థలు స్థాపించి, నిర్వహించే హక్కు ఉంది" అని రాజ్యాంగం పేర్కొంటోంది.

అల్పసంఖ్యాక వర్గాలను సాధారణంగా మతపరం, భాషాపరం అని అనుకుంటూ ఉంటారు. ఎక్కడ నివసిస్తున్నారు అన్నదానిబట్టి అల్పసంఖ్యాకులా, కాదా అన్నది ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాట్లాడే ప్రజలు అధిక సంఖ్యాకులు, కానీ పశ్చిమ బెంగాల్‌లో వాళ్లు అల్పసంఖ్యాకులౌతారు. అదేవిధంగా పంజాబులో సిక్కు మతస్తులు అధిక సంఖ్యలో ఉన్నారు కానీ ఆంధ్రప్రదేశ్, రాజస్తాన్, హర్యానా వంటి రాష్ట్రాలలో అల్పసంఖ్యాకులుగా ఉంటారు.

తమ సంస్కృతిని, భాషను కాపాడుకోటానికి సంస్థలను ఏర్పాటు చేసి, నిర్వహించే స్వేచ్ఛ వీళ్లకి ఉంటుంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో కన్నడ మాట్లాడే ప్రజలు తమ భాష, సంస్కృతులను కాపాడటానికి కన్నడ మాధ్యమంలో పాఠశాలను నడపాలనుకుంటే దానిని అడ్డుకోటానికి లేదు.

ఇతర నియమాలన్నింటినీ పూర్తి చేస్తే ఇటువంటి పాఠశాలలను ప్రభుత్వం గుర్తించి, అందుకు నిధులను కూడా సమకూర్చాలి. పై ఉదాహరణలోని పాఠశాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బోర్డుకు అనుసంధానం అయి, బోర్డు నియమాలను పాటిస్తే ఇతర ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల మాదిరిగానే అది కూడా ప్రభుత్వ నిధులను పొందవచ్చు.

© SCERT not to be republished

## రాజ్యాంగ పరిహారపు హక్కు

ఇంతకు ముందు పేర్కొన్నట్టు ఈ హక్కులు చాలా ముఖ్యమైనవి. ప్రభుత్వం ఈ హక్కులను ఉల్లంఘించినప్పుడు ఆ వ్యక్తి రాష్ట్రాల, దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు ఉంది. న్యాయస్థానాలు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయటం ద్వారా ఈ హక్కులను తిరిగి అందిస్తాయి. ప్రజల ప్రాథమిక హక్కులు ఉల్లంఘింపబడ కుండాచూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ప్రభుత్వం ఇందులో విఫలమైనప్పుడు దానిపై దావా వేయవచ్చు.

తమ హక్కులు ఉల్లంఘింపబడినప్పుడు సమాజంలోని పేద, బలహీన వర్గాల ప్రజలు చాలా సందర్భాలలో న్యాయస్థానానికి కూడా వెళ్లలేని స్థితిలో ఉంటారు. ఈ హక్కులు అందరికీ ఉండేలా చేయటానికి ప్రజాప్రయోజన దావా (ఇంగ్లీషులో పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్, క్లుప్తంగా 'పిల్') వేయటానికి ప్రజలను కోర్టులు ప్రోత్సహించాయి. ఒక ప్రజాబృందం హక్కులకు భంగం కలిగినప్పుడు అందులో ప్రతి ఒక్కరూ వేరువేరుగా దావా వేయాల్సిన అవసరం లేదు. ఏ వ్యక్తి అయినా (లేదా సంస్థ అయినా) ఈ ప్రజల తరఫున ప్రభుత్వం మీద దావా వేయవచ్చు. అందుకే ఇటువంటి దావాలను ప్రజా ప్రయోజన దావాలంటారు. ప్రస్తుతం ఇది ఇంకా విస్తృతమయ్యి పర్యావరణ అంశాలు, ప్రభుత్వాల పారదర్శకత, కారాగారవాసులను చూస్తున్న తీరు వంటివి ప్రజా ప్రయోజన దావా కింద చేపడుతున్నారు.

### ప్రజా ప్రయోజన దావాకి ఉదాహరణ

*ఒక నదిపై ఆనకట్ట కట్టాలని ప్రభుత్వం తలపెట్టిందని అనుకుందాం. ఆనకట్ట కడితే పొలాలు మునిగిపోయే రైతులు 50,000 మంది ఉన్నారనుకుందాం. దాంతో వాళ్లు తమ భూమి, ఉపాధి కోల్పోతారు. వాళ్ల జీవన విధానం తీవ్రంగా ప్రభావితమౌతుంది. జీవించే హక్కు, దేశంలో ఎక్కడైనా నివాసం ఏర్పరచుకునే హక్కు, తమకు నచ్చిన వృత్తిని చేపట్టే హక్కులను ఇది ఉల్లంఘిస్తోంది. ఇటువంటి పరిస్థితులలో ఈ ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడటానికి దేశ సర్వోన్నత న్యాయస్థానంలో దావా వేయవచ్చు. 50,000 ప్రజల తరఫున ఒక్క దావా వేయవచ్చు.*

## ప్రాథమిక హక్కుల పరిధి

రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఎప్పటికప్పుడు సవరిస్తూ వచ్చారు. అంతేకాకుండా విద్యాహక్కు వంటి కొత్త హక్కులను వాటికి చేర్చారు. పార్లమెంటు ద్వారా హక్కులను సవరించవచ్చు. లేదా ఒక హక్కు అర్థాన్ని విస్తృతపరుస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పులు ఇవ్వవచ్చు. ఉదాహరణకు ఆహారానికి హక్కును విస్తృతపరిచి జీవించే హక్కు నేపథ్యంలోకి చేర్చారు.

## ఇతర సంస్థలు, హక్కులు

ప్రజాస్వామ్యం మాదిరిగానే హక్కులు కూడా ప్రపంచవ్యాప్తంగా అనేకమంది దృష్టిని ఆకర్షించాయి. ఈ హక్కుల మూలాలను ఇంగ్లాండ్‌లోని మాగ్నాకార్టాలోనూ, ఫ్రెంచి విప్లవంలోనూ ఉన్నాయి: పురుషుల, పౌరుల హక్కులను ఇక్కడ ప్రకటించారు. ప్రపంచ యుద్ధాల తరవాత ఇకపై పెద్ద యుద్ధాలు జరగకుండా చూడాలన్న ప్రధాన ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితిని నెలకొల్పారు. ఐక్యరాజ్యసమితి తొమ్మిది దేశాల బృందంతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసింది. 30 అధికరణాలతో ఈ సంఘం మానవ హక్కుల

© SCERT not to be republished

ముసాయిదా ప్రతిని తయారు చేసింది. 1948లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం దీనిని ఆమోదించటంతో విశ్వవ్యాప్త మానవహక్కుల ప్రకటనగా ఇది మారింది. ఈ ప్రకటనపై సంతకం చేసిన ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలన్నీ ఈ హక్కులను కాపాడాలి. వీటికి చట్టాలకున్న బలం లేదు కానీ ఈ హక్కులనూ ఉల్లంఘించటం అంతర్జాతీయ సమాజానికి ఆమోదయోగ్యంగా ఉండదు; అనేక సందర్భాలలో వీటిని ఉల్లంఘించిన దేశాలపై ఇతర దేశాలు కొన్ని ఆంక్షలు విధించవచ్చు.




చిత్రం 21.4: బాలల హక్కులపై ఒక గోడ పత్రిక

## మానవ హక్కుల సంఘం

ప్రజల మౌలిక మానవ హక్కులను కాపాడటానికి ఐక్యరాజ్యసమితి కృషి చేస్తోంది, సభ్యదేశాలను కూడా అందుకు ప్రోత్సహిస్తుంది. 1993లో భారత ప్రభుత్వం మానవ హక్కులను కాపాడటానికి ఒక చట్టాన్ని చేసింది. ఈ చట్టం కింద జాతీయ మానవ హక్కుల సంఘాన్ని నెలకొల్పింది. పౌర న్యాయస్థానాలకు ఉండే అధికారం ఈ సంఘానికి దేశమంతటా ఉండేలా చట్టం వీలు కల్పించింది. హక్కుల ఉల్లంఘన జరిగే పరిస్థితులపై విచారణ, పర్యవేక్షణల కోసం ప్రభుత్వం ఇతర సంస్థలను కూడా నెలకొల్పింది. ఈవిధంగా మనకు జాతీయ మహిళా సంఘం, జాతీయ అల్పసంఖ్యాకుల సంఘం, రాష్ట్ర మానవ హక్కుల సంఘాలు వంటివి ఉన్నాయి.

జాతీయ మానవ హక్కుల సంఘానికి తనంతట తాను ('సు మోటో') విచారణ చేపట్టే అధికారం ఉంది. లేదా బాధితులు, బాధితుల తరపున ఏ వ్యక్తిఅయినా ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టవచ్చు. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి ఏ న్యాయస్థానంలోనైనా విచారణ జరుగుతున్నప్పుడు దాన్ని అనుమతితో ఈ సంఘం అందులో జోక్యం చేసుకోవచ్చు. మానవ హక్కుల రక్షణకు రాజ్యాంగం కింద, దాని ద్వారా ఉన్న అంశాలను సమీక్షించి అవి మరింత మెరుగ్గా అమలు కావటానికి తీసుకోవాల్సిన చర్యలను ఈ సంఘం సిఫారసు చేస్తుంది.

అంతర్జాతీయ స్థాయిలో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘాన్ని నెలకొల్పింది. అంతర్జాతీయ ఒప్పందాలలోని ఉల్లంఘనలను ఇది సమీక్షిస్తుంది.

© SCERT not to be republished

## మానవ హక్కుల ఉల్లంఘన

పోలీసుల వేధింపులు, ఇష్టమొచ్చినట్లు అరెస్టు చేయుటం, సమాచార హక్కును తిరస్కరించటం, అవినీతి, మహిళల లైంగిక వేధింపులు, అత్యాచారాలు, నేర విచారణలో ఆలస్యం, స్త్రీ శిశు హత్య, డబ్బుకోసం కిడ్నాపింగ్, మహిళలు, పిల్లలు, అట్టడుగు ప్రజల దారుణ జీవన పరిస్థితులు, కుటుంబంలో మహిళల పట్ల వివక్షత, ఇంటిపని చేసే వాళ్లపై హింస వంటివి మానవ హక్కుల ఉల్లంఘనలకు కొన్ని ఉదాహరణలు. తమ హక్కుల గురించి ప్రజలకు తెలియకపోవటం వల్ల ఈ ఉల్లంఘనలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. మానవ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. వీటి ఉల్లంఘనలకు సంబంధించి ఫిర్యాదులను జాతీయ, రాష్ట్రాల మానవహక్కుల సంఘాలకు చేయవచ్చు.



*చిత్రం 21.5: (ఐక్యరాజ్యసమితి) మానవ హక్కుల లోగో*

- మన రాష్ట్రంలో మానవ హక్కుల సంఘం ఉందా? దాని కార్యక్రమాల గురించి తెలుసుకోండి.
- మానవ హక్కులకు ఉల్లంఘనలను కొన్నింటిని పేర్కొనండి.
- మీ ప్రాంతంలో ఏదైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని తెలిస్తే దానికి సంబంధించి జాతీయ మానవ హక్కుల సంఘానికి ఒక ఫిర్యాదు రాయండి.

© SCERT not to be republished

## ప్రాథమిక విధులు

హక్కులు ఉన్నట్లే మనకు కొన్ని విధులు/బాధ్యతలు ఉన్నాయి. మన చుట్టుపక్కల ఉండే ప్రజల పట్ల ఈ బాధ్యతలను నిర్వర్తించాలి. అయితే ప్రాథమిక హక్కుల మాదిరి కాకుండా ఏ వ్యక్తి అయినా ఈ విధులను ఉల్లంఘించినపుడు వాళ్ల పై న్యాయస్థానానికి వెళ్లటానికి లేదు.

"ప్రతి ఒక్క భారత పౌరుని విధులు"

అ) రాజ్యాంగబద్ధంగా నడచుకోవాలి, జాతీయగీతాన్ని కాని, జాతీయజెండాను కాని అవమానించకూడదు.

ఆ) స్వాతంత్ర్యానికి స్ఫూర్తినిచ్చిన జాతీయ ఉద్యమ ఉన్నత ఆదర్శాలను గౌరవించి, అనుసరించాలి.

ఇ) భారతదేశ సార్వభౌముకత, సమగ్రతలను కాపాడాలి.

ఈ) దేశ రక్షణకు బాధ్యత వహించాలి.

ఉ) వివిధ భాషలు, మతాల ప్రజల మధ్య శాంతి, సామరస్యాలను నెలకొల్పాలి. మహిళల గౌరవానికి భంగం కలిగించకూడదు.

ఊ) దేశ పర్యావరణ క్షీణతను నివారించాలి, మెరుగుపరచాలి.

ఎ) మన దేశ ఉమ్మడి సంస్కృతి, మహోన్నత వారసత్వ సంపదను గౌరవించి, కాపాడాలి.

ఏ) శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, అన్వేషణ, సంస్కరణల దృక్పథాన్ని అలవరచుకోవాలి.

ఐ) ప్రజా ఆస్తులను కాపాడాలి.

ఒ) అన్ని రంగాలలో అత్యున్నత శ్రేణిని అందుకోటానికి కృషి చేయాలి.

ఓ) పిల్లలను విద్యావంతులుగా చేయాలి.

## కీలక పదాలు

1. ప్రాథమిక హక్కులు
2. మానవ హక్కులు
3. వ్యాజ్యం/ దావా
4. బిరుదులు
5. మధ్యవర్తిత్వం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కింద పేర్కొన్న వాటిలో ఏది ప్రాథమిక హక్కులలో భాగం కాదు?

   అ. బీహార్ కార్మికులు పంజాబ్‌కి వెళ్లి అక్కడ పని చేయటం.

   ఆ. అల్పసంఖ్యాక మత వర్గం బడులు నడపటం.

   ఇ. ప్రభుత్వ ఉద్యోగాలలో స్త్రీ, పురుషులకు ఒకే జీతం లభించటం.

   ఈ. తల్లిదండ్రుల ఆస్తి పిల్లలకు సంక్రమించటం.

2. కింద పేర్కొన్న వాటిల్లో ఏ స్వేచ్ఛ భారత పౌరులకు లేదు?

   అ. ప్రభుత్వాన్ని విమర్శించే స్వేచ్ఛ.

   ఆ. సాయుధ విప్లవంలో పాల్గొనే స్వేచ్ఛ.

   ఇ. ప్రభుత్వాన్ని మార్చే ఉద్యమాన్ని చేపట్టే స్వేచ్ఛ.

   ఈ. రాజ్యాంగ మౌలిక విలువలను వ్యతిరేకించే స్వేచ్ఛ.

3. ప్రజాస్వామ్యం, హక్కుల మధ్య సంబంధానికి కింద పేర్కొన్న వాటిల్లో ఏది సరైనది? మీ ఎంపికకు కారణాలు పేర్కొనండి.

   అ. ప్రజాస్వామికమైన ప్రతి దేశం తన పౌరులకు హక్కులను ఇస్తుంది.

   ఆ. పౌరులకు హక్కులు ఇచ్చే ప్రతి దేశం ప్రజాస్వామిక దేశం అవుతుంది.

   ఇ. హక్కులు ఇవ్వటం మంచిదే, కాని ప్రజాస్వామ్యానికి అవి తప్పనిసరి కాదు.

4. స్వాతంత్ర్యపు హక్కుకు దిగువ పేర్కొన్న పరిమితులు విధించటం సరైనదేనా? మీ సమాధానాలకు కారణాలను ఇవ్వండి.

   అ. భద్రత దృష్ట్యా దేశంలోని కొన్ని సరిహద్దు ప్రాంతాలను సందర్శించటానికి భారతీయ పౌరులకు అనుమతి కావాలి.

   ఆ. స్థానిక ప్రజల ప్రయోజనాలను కాపాడటానికి కొన్ని ప్రాంతాలలో బయటివాళ్లు ఆస్తులు కొనటాన్ని నిషేధించారు.

   ఇ. రాబోయే ఎన్నికలలో అధికారంలో ఉన్న పార్టీ విజయావకాశాలను దెబ్బతీసే పుస్తక ప్రచురణను ప్రభుత్వం నిషేధించింది.

© SCERT not to be republished

5. ఈ అధ్యాయం, గత అధ్యాయం చూసి రాజ్యాంగం ఇచ్చిన ఆరు ప్రాథమిక హక్కుల జాబితాను తయారు చేయండి.

6. కింద పేర్కొన్న వాటిల్లో ప్రాథమిక హక్కులు ఉల్లంఘింపబడుతున్నాయా? అలా అయితే ఏ హక్కు లేదా హక్కులు ఉల్లంఘింపబడుతున్నాయి? తరగతిలో మీ తోటి విద్యార్థులతో చర్చించండి.

అ. ఏ చట్టాన్ని అతిక్రమించారో చెప్పకుండా ఒక వ్యక్తిని నాలుగు రోజులపాటు పోలీసు స్టేషనులో ఉంచారు.

ఆ. నీ ఆస్తిలో కొంత భాగం తనదని పక్క వ్యక్తి పేర్కొనటం.

ఇ. మీ తల్లిదండ్రులు నిన్ను బడికి వెళ్లనివ్వటం లేదు. నీకు ఆహారం సరిగా పెట్టలేకపోతున్నారు కాబట్టి నిన్ను అగ్గిపెట్టెల కర్మాగారంలో పనిచేయటానికి పంపిస్తున్నారు.

ఈ. మీ తండ్రినుంచి వారసత్వంగా నువ్వు పొందిన ఆస్తిని నీ సోదరుడు నీకు ఇవ్వటానికి నిరాకరిస్తున్నాడు.

7. మీరు ఒక న్యాయవాది అనుకోండి. కొంతమంది ప్రజలు దిగువ పేర్కొన్న విన్నపంతో మీ దగ్గరకు వచ్చారు. వాళ్ల తరఫున మీరు ఏవిధంగా వాదిస్తారు?

"ఎగువన ఉన్న కర్మాగారాల వల్ల మా ప్రాంతంలోని నదీజలాలు బాగా కలుషితం అవుతున్నాయి. మాకు మంచినీళ్లు ఈ నదినుంచే వస్తాయి. ఈ నీళ్లు కలుషితం కావటం వల్ల మా ఊరి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. మేం ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాం కాని వాళ్లు ఎటువంటి చర్యా తీసుకోలేదు. ఇది ఖచ్చితంగా మా ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే."

8. 'బిరుదుల రద్దు' అన్న శీర్షిక కింద ఉన్న వాక్యాలను చదివి ఈ ప్రశ్నకు సమాధానమివ్వండి.

ఈ బహుమతులు పొందిన వ్యక్తి దానిని బిరుదుగా ఉపయోగించుకోకూడదు. ఎందుకు?

© SCERT not to be republished

## ప్రాజెక్టు

1. ఒక సీనియర్ న్యాయవాదిని మీ తరగతికి ఆహ్వానించి, ముఖాముఖి ద్వారా ఈ కింది విషయాలు తెలుసుకోండి:

- ప్రాథమిక హక్కుల ఉల్లంఘన, వాటి పర్యవసానాలు
- బాలల హక్కుల ఉల్లంఘన
- ప్రజాస్వామ్యంలో హక్కుల కోసం పోరాడే విధానాలు
- సంబంధిత ఇతర విషయాలు